RNI. No. TELTEL /2022/ 89348




మన వార్తలు.. మన సమాచారం.. మన విశేషాల మాగాణ.. మన..

# తెలంగాణ అవతరణ

ఆత్మ గౌరవ అక్షర సాక్ష్యం

తె లు గు ది న ప త్రి క

సంపుటి : 4 సంచిక : 103 | పెద్దపల్లి | ఎడిటర్ : పి. రామకృష్ణ | మంగళవారం, ఏప్రిల్, 7, 2026 | పేజీలు : 8 | వెల : రూ. 5/-

## బాసరలో పలు అభివృద్ధి పనులకు
# శంకుస్థాపన చేసిన సీఎం

- బాసర ఆలయంలో మనవడికి అక్షరాభ్యాసం చేయించిన సీఎం రేవంత్ రెడ్డి
- కుటుంబ సభ్యులతో అమ్మవారిని దర్శించుకున్న ముఖ్యమంత్రి
- సీఎం మనవడికి అక్షరాభ్యాసం చేయించిన ఆలయ ప్రధాన అర్చకుడు..

బాసర: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాసర సరస్వతి అమ్మవారి క్షేత్రంలో తన మనవడు రియాన్ష్ (రుద్రదేవ్)కు అక్షరాభ్యాసం చేయించారు. ముఖ్యమంత్రి ఈరోజు బాసరలో పర్యటించి ఆలయ అభివృద్ధి పనులకోసం భూమిపూజ చేశారు. కుటుంబంతో సహా ముఖ్యమంత్రి అమ్మవారిని దర్శించుకున్నారు. వేదపండితులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం సీఎం తన మనవడికి అక్షరాభ్యాసం చేయించారు. బాసర ఆలయ ప్రధాన అర్చకుడు సంజీవ్ మహారాజ్... రియాన్ష్ కు పలక బలపంతో అక్షరాభ్యాసం చేయించారు.



సీఎం రేవంత్ రెడ్డి దంపతులు, వారి కుమార్తె నైమిశా రెడ్డి దంపతులతో పాటు మంత్రులు కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావు, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, జిల్లా కాంగ్రెస్ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కాగా, తన మనవడికి తల్లిదండ్రులు రియాన్ష్ అని పేరు పెట్టగా,తాను మాత్రం రుద్రదేవ్ అని పిలుచుకుంటానని ఒక సందర్భంలో ముఖ్యమంత్రి చెప్పారు.

# జిల్లాలో త్వరలో యూనివర్శిటీ నిర్మిస్తాం

ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు కూడా వేదికలపై మాట్లాడే అవకాశం కల్పిస్తున్నాం: రేవంత్
తమ్మిడిహెట్టి నుంచి ప్రాణహిత ప్రాజెక్టును తిరిగి ప్రారంభిస్తాం...
ఆదిలాబాద్ జిల్లాలో అతిపెద్ద పారిశ్రామికవాడను ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడి
జిల్లాలో త్వరలో యూనివర్శిటీ నిర్మిస్తాం: సీఎం..

**ఆదిలాబాద్,ఏప్రిల్,6:**ఎన్నికలకు ముందు పీపుల్స్‌మార్చ్ పేరుతో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చేపట్టిన పాదయాత్ర పిప్రి నుంచే మొదలయిందని... ఇక్కడి ప్రజలు ఇచ్చిన ధైర్యంతోనే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. పాదయాత్రకు మూడేళ్లు పూర్తయిన సందర్భంగా పిప్రిలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధిపై ఆయన వరాల జల్లు కురిపించారు.

గత ప్రభుత్వంలో ప్రతిపక్షాలను నిర్బంధించే సంస్కృతి ఉండేదని, కానీ తమ 'ప్రజాపాలన'లో ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు కూడా వేదికలపై మాట్లాడే అవకాశం కల్పిస్తున్నామని సీఎం తెలిపారు. పార్టీలకుఅతీతంగా, తమ ఎమ్మెల్యేలు లేని నియోజకవర్గాల్లో కూడా నిధులు కేటాయిస్తూ అభివృద్ధి చేస్తున్నామని స్పష్టం చేశారు. త్వరలోనే ఆదిలాబాద్‌కు విమా నాశ్రయం రాబోతోందని, వీలైతే జూన్ 2వ తేదీన దీనికి శిలాఫలకం వేస్తామని ప్రకటించారు. వేలాది ఎకరాల్లో దేశంలోనే అతిపెద్ద పారిశ్రామికవాడను



ఇక్కడ ఏర్పాటు చేయబోతున్నామని, దీని ద్వారా స్థానిక యువతకు భారీగా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని చెప్పారు.

తమ్మిడిహెట్టి నుంచి ప్రాణహిత ప్రాజెక్టును తిరిగి ప్రారంభిస్తామని, ఇందుకు సంబంధించి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో సర్వేలు జరుగుతున్నాయని తెలిపారు. జిల్లాలో త్వరలోనే యూనివర్సిటీని నిర్మిస్తామని, అలాగేబాసర క్షేత్రాన్ని దేశంలోనే గొప్పగా తీర్చిదిద్దుతా మనిహామీ ఇచ్చారు. మహిళలకు ఉచితబస్సు ప్రయాణం కోసం ఇప్పటివరకు రూ.10వేల కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లుపథకం వేగంగా కొనసాగుతోందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనలప్రకారం 2027మార్చి వరకు జిల్లాల సరిహద్దు మార్పులకు అవకాశం లేదని, ఆ తర్వాత జ్యుడీషియల్ కమిషన్ వేసి బోథ్ రెవెన్యూ డివిజన్ వంటి డిమాండ్లను పరిష్కరిస్తామని చెప్పారు.

# ఏలూరు జిల్లాలో వర్షం, ఈదురుగాలుల బీభత్సం

ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం
గాలివానకు నేలరాలిన మామిడి, జీడి, అరటి, వరి పంటలు

జంగారెడ్డిగూడెం: ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం, పరిసర ప్రాంతాల్లో సోమవారం సాయంత్రంఈదురు గాలులతో కూడిన భారీ వర్షం బీభత్సం సృష్టించింది. గత మూడు రోజులుగా తీవ్రమైన ఎండలతో అల్లాడిపోతున్న ప్రజలకు ఈ వర్షం ఉపశమనం కలిగించినా, రైతులకు మాత్రం కన్నీళ్లను మిగిల్చింది. చేతికి అందివచ్చిన పంటలు నేలపాలు కావడంతో అన్నదాతలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు గంటపాటు ఎడతెరిపి లేకుండా కురిసిన కుండపోత వర్షానికి, బలమైన ఈదురు గాలులకు జనజీవనం స్తంభించింది. జంగారెడ్డిగూడెం సమీపంలోని వేగవరం ప్రధాన రహదారిపై ఓభారీ వృక్షం విరిగిపడటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గాలివాన ధాటికి మామిడి, జీడి తోటల్లో



కాయలు పెద్ద ఎత్తున నేలరాలాయి. మరో నెల రోజుల్లో కోత కోసి మార్కెట్‌కు తరలించాల్సిన మామిడి పంట కళ్ల ముందే దెబ్బతినడంతో రైతులు లబోదిబోమంటున్నారు. మామిడితో పాటు కోతకు సిద్ధంగా ఉన్న వరి, అరటి, జీడిమామిడి వంటి ఇతర పంటలు కూడాతీవ్రంగా నష్టపోయాయని రైతులు వాపోతున్నారు.

# కొడుకు కళ్లెదుటే తండ్రి హత్య...

రాత్రంతా మృతదేహం పక్కనే పసివాడు!
అన్నమయ్య జిల్లాలో దారుణ హత్య..
తండ్రిని కోల్పోయిన ఐదేళ్ల బాలుడు
బోయకొండ అడవిలో రాత్రంతా తండ్రి శవం పక్కనే చిన్నారి
ఉదయాన్నే నడుచుకుంటూ వెళ్లి అంగన్‌వాడీ టీచర్‌కు సమాచారం ఇచ్చిన బాలుడు
వివాహేతర సంబంధమే హత్యకు కారణమని పోలీసుల అనుమానం

పుంగనూరు: కళ్లు తెరిచి చూస్తే కటిక చీకటి... చుట్టూ దట్టమైన అడవి... పక్కనే తండ్రి విగతజీవిగా పడి ఉన్నాడు. ఆ ఐదేళ్ల చిన్నారికి ఏం జరిగిందో అర్థం కాలేదు. భయంతో వణికిపోతూ, నాన్నను లేపేందుకు ప్రయత్నించి విఫలమయ్యాడు. తన కళ్లెదుటే తండ్రిని కొందరు దుండగులు హత్య చేస్తుంటే ఆ లేత హృదయం పడిన ఆవేదన వర్ణనాతీతం. రాత్రంతా ఆ చిట్టడవిలో తండ్రి శవం పక్కనే ఒంటరిగా బిక్కుబిక్కుమంటూ గడిపిన ఆ బాలుడి గాథ అందరినీ కంటతడి పెట్టిస్తోంది. ఈ ఘటన అన్నమయ్య జిల్లాలో వెలుగుచూసింది. అన్నమయ్య జిల్లా పుంగనూరు నియోజకవర్గంలోని చౌడేపల్లి మండలం, బోయకొండ అటవీ ప్రాంతంలో ఈ హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. తమిళనాడులోని గుడియాత్తంకు చెందిన గాంధీ, తన ఐదేళ్ల కుమారుడితో పాటు మరికొందరి తో కలిసి మద్యం సేవించడానికి బోయకొండ అడవికి వెళ్లాడు. మద్యం తాగిన తర్వాత వారి మధ్య తలెత్తిన వివాదం చివరకు గాంధీ హత్యకు దారితీసింది. నిందితులు అతడిని దారుణంగా కొట్టి చంపి, అక్కడి నుంచి పరారయ్యారు. అయితే, ఈ ఘోరమంతా కళ్లారా చూసిన ఆ చిన్నారిని అక్కడే వదిలేశారు. రాత్రంతా భయంతో గడిపిన బాలుడు,ఉదయం కాగానే ధైర్యం కూడగట్టుకున్నాడు. సుమారు ఒకటిన్నర కిలోమీటర్ల దూరం ఆఅడవిలో ఒంటరిగా నడుచుకుంటూ, సమీపంలోని ఓ అంగన్‌వాడీ కేంద్రానికి చేరుకున్నాడు.

## అసెంబ్లీ ఎన్నికల వేళ...
# ప్రింట్ మీడియా యాడ్స్‌పై ఈసీ కఠిన నిబంధనలు

ప్రింట్ మీడియా యాడ్స్‌పై ఈసీ కొత్త మార్గదర్శకాలు
పోలింగ్‌కు ముందు ప్రకటనలకు ప్రీ-సర్టిఫికేషన్ తప్పనిసరి
రాష్ట్ర, జిల్లా స్థాయి కమిటీల నుంచి అనుమతి అవసరం
చెల్లింపు వార్తలపై కూడా నిఘా పెట్టాలని ఆదేశం
రాష్ట్రాల్లో రూ.650 కోట్లకు పైగా అక్రమ సొమ్ము, మద్యం స్వాధీనం...

న్యూఢిల్లీ, ఏప్రిల్,6: మరికొన్ని రోజుల్లో పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, ఉప ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) కీలక మార్గదర్శకాలు జారీ చేసింది. ఎన్నికల ప్రచారాన్ని స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించే లక్ష్యంతో ప్రింట్ మీడియాలో ఇచ్చే రాజకీయ ప్రకటనలపై కఠిన నిబంధనలు విధించింది. పోలింగ్ రోజు,దానికి ఒక రోజు ముందు ఇచ్చే ప్రకటనలకు ముందస్తు అనుమతిని తప్పనిసరి చేసింది. ఈ నిబంధనల ప్రకారం, రాష్ట్ర లేదా జిల్లా స్థాయిలోని మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) నుంచి ముందస్తు అనుమతి లేకుండా ఏరాజకీయ పార్టీ, అభ్యర్థి లేదా సంస్థ ప్రకటనలు ప్రచురించకూడదు. వ్యక్తిగత అభ్యర్థులు, ఇతరులు జిల్లా స్థాయి ఎంసీఎంసీని సంప్రదించాల్సి ఉండగా, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు రాష్ట్ర స్థాయిఎంసీఎంసీ నుంచిఅనుమతి తీసుకోవాలని కమిషన్ స్పష్టం చేసింది. ప్రకటన ప్రచురించాలనుకుంటున్న తేదీకి కనీసం రెండు రోజుల ముందు దరఖాస్తు చేసుకోవాలని సూచించింది.

**ఎన్నికల షెడ్యూల్ ప్రకారం పలు రాష్ట్రాల్లో**




**ఈ నిబంధనలు నిర్దిష్ట తేదీల్లో అమల్లోకి రానున్నాయి.**

అస్సాం, కేరళ, పుదుచ్చేరి: ఏప్రిల్ 9న పోలింగ్ జరగనుండగా, ఏప్రిల్ 8, 9 తేదీల్లో ఇచ్చే ప్రకటనలకు ఈ నిబంధన వర్తిస్తుంది.


తమిళనాడు: ఏప్రిల్ 23న పోలింగ్ ఉండటంతో, ఏప్రిల్ 22,23 తేదీల్లో యాడ్స్‌పై ఆంక్షలుఉంటాయి. పశ్చిమ బెంగాల్: తొలి దశ (ఏప్రిల్ 23 పోలింగ్)కుఏప్రిల్ 22,23 తేదీల్లో, రెండో దశ (ఏప్రిల్ 29 పోలింగ్)కు ఏప్రిల్ 28,29 తేదీల్లో ప్రీ-సర్టిఫికేషన్ తప్పనిసరి.

ఈ కమిటీలు కేవలం ప్రకటనల పరిశీలనే కాకుండా, మీడియాలో వచ్చేపెయిడ్‌న్యూస్ (చెల్లింపు వార్తలు) పైనా కఠిననిఘా ఉంచి, అవసరమైన చర్యలు తీసుకోవాలని ఈసీఆదేశించింది. ఇదిలా ఉండగా, ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల్లో ఓటర్లను ప్రలోభపెట్టే యత్నాలను అరికట్టేందుకుతీసుకుంటున్న చర్యల్లో భాగంగా భారీగా అక్రమ సొమ్ము, మద్యం, మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నట్లు ఈసీ వెల్లడించింది. ఎలక్ట్రానిక్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఈఎస్ఎంఎస్) ప్రారంభమైన ఫిబ్రవరి26 నుంచి ఇప్పటివరకు మొత్తం రూ.651.51 కోట్లకు పైగా విలువైన వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపింది.

# జీవో లేదు.. కానీ నీళ్లొచ్చాయి..

## సీఎం చంద్రబాబు సమక్షంలో జేసీ అస్మిత్ రెడ్డి భావోద్వేగ ప్రసంగం...

సీఎం చంద్రబాబును అపర భగీరథుడితో పోల్చిన తాడిపత్రి ఎమ్మెల్యే అస్మిత్ రెడ్డి
చంద్రబాబు రైతుల గుండెల్లో బలరాముడిగా నిలిచిపోయారని భావోద్వేగ ప్రసంగం



యాడికి: ముఖ్యమంత్రి చంద్రబాబు తమ ప్రాంత రైతుల పాలిట అపర భగీరథుడు,ఆపద్బాంధవుడు అని తాడిపత్రి టీడీపీ ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి కొనియాడారు. కేవలం మాట ఇచ్చి, ఎలాంటి జీవోలు లేకుండానే తాడిపత్రి నియోజకవర్గానికి సాగునీరు అందించి రైతుల కన్నీళ్లు తుడిచారని ఆయన భావోద్వేగంతో ప్రశంసించారు.

అనంతపురం జిల్లా యాడికిలో 'నీటి భద్రత-సాగునీటి సంఘాల బాధ్యత' కార్యాచరణ ప్రారంభం సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం చంద్రబాబు, జేసీ అస్మిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సభలో అస్మిత్‌రెడ్డి భావోద్వేగంతో ప్రసంగించారు. గతంలో సీఎంతో తనకు ఎదురైన ఓ అనుభవాన్ని ప్రజలతో పంచుకున్నారు.

**జీవో లేదు.. కానీ నీళ్లొచ్చాయి:** గతంలో అసెంబ్లీ సమావేశాల సమయంలో తాను ముఖ్యమంత్రిని కలిసి యాడికి కాలువకు, ముచ్చుకోట రిజర్వాయర్‌కు నీటి కేటాయింపుల కోసం ఒక జీవో ఇవ్వాలని కోరినట్లు అస్మిత్ రెడ్డి గుర్తుచేసుకున్నారు. "ఆ సమయంలో సీఎం చంద్రబాబు గారు నన్ను దగ్గరకు తీసుకుని భుజంపై చేయి వేసి 'తమ్ముడూ.. జీవో గీవో ఏమీ లేదు. ప్రతి చెరువుకూ, ప్రతి కాలువకూ నీళ్లు ఇచ్చే బాధ్యత నాది. నువ్వు ధైర్యంగా వెళ్లు' అని చెప్పారు.

మొదటిసారి ఎమ్మెల్యే అయిన నాకు, చేతిలో కాగితం లేకపోతే అధికారులను ఎలాఅడగాలా అని కొంత దిగులు కలిగింది. కానీ మీరు నమ్ముతారో నమ్మరో, నేను తాడిపత్రికి తిరిగి రాకముందే సీఎం కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చాయని, రైతులకు నీళ్లు ఇవ్వాలని చెప్పారని అధికారుల నుంచి నాకు ఫోన్లు వచ్చాయి" అని అస్మిత్ రెడ్డి వివరించారు. సీఎం మాట నిలబెట్టుకున్నారని, ఆయన చొరవతో సాధారణంగా డిసెంబర్‌కే ఎండిపోయే చెరువులు, ఈసారి ఏప్రిల్ నెలలో కూడా నీటితో కళకళలాడాయని తెలిపారు.

**రైతుల గుండెల్లో బలరాముడు:** చంద్రబాబుపై ప్రశంసలు కొనసాగిస్తూ, "ఆనాడుభగీరథుడు గంగనుభూమిపైకి తెచ్చాడో లేదో తెలియదు కానీ, మీరు మాత్రం ఈనాటి భగీరథుడై మా దాహార్తిని తీర్చారు. కష్టాల్లో ఉన్నప్పుడు ఆపద్బాంధవుడై కన్నీళ్లు తుడిచారు. చివరికి, రైతుల గుండెల్లో ఒక బలరాముడై నిలిచిపోయారు" అని అస్మిత్ రెడ్డి అన్నారు. పెండింగ్ ప్రాజెక్టులు, జూనియర్ కాలేజీపై విజ్ఞప్తి: నియోజకవర్గంలోని పలు సమస్యలను కూడా ఆయన సీఎం దృష్టికి తీసుకెళ్లారు.

# యూపీఐ దూకుడు...

2025లో 33 శాతం పెరిగిన లావాదేవీలు..!
2025లో 33 శాతం వృద్ధితో 228.5 బిలియన్లకు చేరిన యూపీఐ లావాదేవీలు
భారత్ బిల్‌పే ద్వారా చెల్లింపులు 40 శాతం మేర వృద్ధి నమోదు
చిన్న వ్యాపారులు సైతం డిజిటల్ చెల్లింపులు స్వీకరించడం పెరిగిందని నివేదిక వెల్లడి...

**న్యూఢిల్లీ,ఏప్రిల్,6:** భారత్‌లో డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ సరికొత్త శిఖరాలను అధిరోహిస్తోంది. 2025 సంవత్సరంలో యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ ద్వారా జరిగిన లావాదేవీలు 33శాతం వృద్ధి చెంది 228.5 బిలియన్లకు చేరాయి. ఈ లావాదేవీల మొత్తం విలువ రూ. 299.74 ట్రిలియన్లుగా నమోదైంది. ఈ వివరాలను 'వరల్డ్‌లైన్' సోమవా రం విడుదల చేసిన తన నివేదికలో వెల్లడించింది.

నివేదిక ప్రకారం, వ్యాపారులకు జరిపిన చెల్లింపులు 34 శాతం పెరిగి 143.82 బిలియన్ల కు చేరాయి. మరోవైపు, యూపీఐ సగటు లావాదేవీ విలువ (యావరేజ్ టికెట్ సైజ్)9 శాతం తగ్గి రూ.1,314కు చేరింది.




ముఖ్యంగా వ్యాపారుల వద్ద జరిపే చెల్లింపుల సగటు విలువ రూ.592కు పడిపోవడం గమనా ర్హం.గతంలో నగదుతో జరిపిన వీధి వ్యాపారుల వద్ద కొనుగోళ్ల వంటి చిన్న చిన్న చెల్లింపులు కూడా డిజిటల్ పరిధిలోకి వస్తున్నాయని ఇది సూచిస్తోందని నివేదిక పేర్కొంది. డిజిటల్ చెల్లింపుల కోసం మౌలిక సదుపాయాలు కూడా భారీగా పెరిగాయి.

2025లో యూపీఐ క్యూఆర్ కోడ్‌లసంఖ్య 15 శాతం పెరిగి 731.38 మిలియన్లకు చేరింది. "భారత డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ పరిణితిలో కొత్త దశకు చేరుకుంటోంది," అని వరల్డ్‌లైన్ ఇండియా సీఈవో రమేష్ నరసింహన్ తెలిపారు. మరోవైపు, భారత్ బిల్‌పే ద్వారా జరిగే రికరింగ్ చెల్లింపులు గణనీయంగా పెరిగాయి.

# సంపాదకీయం

## చెంపదెబ్బ...గోడదెబ్బ !

దేశంలో రెండు అసాధారణమైన కేసులు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. న్యాయవ్యవస్థ గట్టిగా నిలబడేలా తీసుకున్న చర్యలు ఇప్పుడు రాజకీయ నాయకుల కళ్లు తెరిపిస్తాయా లేదా అన్నది చూడాలి.ముందుగా ఢిల్లీ రౌజ్ అవెన్యూ కోర్టు లిక్కర్ స్కామ్‌పై ఇచ్చిన తీర్పు ఒకటయితే..ఎన్‌సిఇఆర్‌టి పుస్తకాల్లో న్యాయవ్యవస్థపై అచ్చేసిన పాఠ్యాంశం మరొకటి. ఈ రెండు కేసుల్లో న్యాయమూర్తులు ఇచ్చిన తీర్పులు లేదా ఆదేశాలు నేరుగా కేంద్రాన్ని ప్రశ్నించాయి. కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని నిలదీసాయి. ఇంతకన్నా ఘోరం మరోటి ఉండదు. ఎందుకంటే తమ చేతుల్లో ఉన్న అధికారాన్ని గుప్పిట పెట్టుకుని దర్యాప్తు సంస్థల ద్వారా లిక్కర్ కేసును అల్లిన తీరు చూస్తే ఇడి, సిబిఐల పరువు పోయింది. సిబిఐ అధికారిపై విచారణ చేయాలని ఢిల్లీ రౌజ్ అవెన్యూ కోర్టు జడ్జి చేసిన వ్యాఖ్యలు చూస్తే కేంద్రం సిగ్గుతో తలదించుకోవాలి. ఇక్కడ సిబిఐ ఇంత నిర్లక్ష్యంగా ఓ కేసులో ఛార్జిషీట్ దాఖలు చేసినందుకు బాధపడాలి. అంటే దాని ప్రతిష్టను అదే దిగజార్చుకుంది. కనీస సమాచారం, దానికి తగ్గ అవసరమైన సాక్ష్యాలు లేకుండా ఓ కేసును గాలిలో మేడలు కట్టినట్లుగా అల్లడం వెనక ఎంతటి నిర్లక్ష్యం ఉందో తెలియచేసింది. రాజ్యాంగ పదవిలో ఉన్న సిఎం కేజ్రీవాల్‌ను జైలులో పెట్టారు. ఉపముఖ్యమంత్రి సిసోడియాను జైలులో పెట్టారు. అంటే ఎంతటి దుర్మార్గానికి సిబిఐ, ఇడిలు ఒడిగట్టాయన్నది తేలిపోయింది. ఇదే విషయాన్ని జడ్జి ప్రశ్నించారు. నిజంగానే లిక్కర్ పాలసీ కేసు అన్నది ఓ అభూత కల్పన కేసు. అందులో ముడుపులు ముట్టాయనడానికి ఆధారాలు లేవు. ఈ కేసుతో సిబిఐ తన తీరును మార్చుకోవాలి. పక్కా సమాచారంతో కేసులను చేపట్టాలి. తద్వారా పోయిన ప్రతిష్టను ఇనుమడించేలా చేసుకోవాలి. ఇది సిబిఐ పరువే కాదు, దేశానికి సంబంధించి ప్రతిష్ట కూడా ఇందులో దాగి ఉంది. సిబిఐ సరిగా పనిచేస్తేనే, ప్రజలకు నమ్మిక ఉంటుంది. ఈ కేసులో ఆధారాలు ఉంటేనే హైకోర్టుకు వెళ్లడం మంచిది. అక్కడా భంగపడేకన్నా ఆధారాలు, సాక్ష్యాలను సేకరించాలి. ప్రాథమికి సమాచారం ఉంటేనే ముందుకు నడవాలి. రాజకీయ కక్షసాధింపులకు పాల్పడే కేసుల నుంచి సిబిఐ, ఇడిలలను దూరంగా ఉంచడం మంచిది. నిజానికి కెసిఆర్ హయాంలో జరిగిన అవినీతిపై కేసులు లేవు. జగన్ హయాంలో జరిగిన ఆర్థిక అవతవకతలపైనా కేసులు లేవు. ఇలాంటి వారి వల్ల ప్రజాధనం దుర్వినియోగం అయ్యింది. వీటిపై చర్యలు తీసుకుంటే రాష్ట్రాల్లో పాలకుల్లో భయం ఉంటుంది. ఇకపోతే మరో కేసులో సుప్రీం చీఫ్ జస్టిస్ చేసిన వ్యాఖ్యలు కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపాయి. జాతీయ, విద్యా పరిశోధన, శిక్షణ మండలి ఎన్‌సిఇఆర్‌టి ప్రచురించిన ఎనిమిదో తరగతి సాంఘికశాస్త్రంలో 'కరప్షన్ ఇన్ ది జ్యూడిషియరీ' అనే పాఠ్యాంశం తీవ్ర వివాదమైంది. సుప్రీంకోర్టు ఈ అంశాన్ని సూమోటోగా విచారణకు తీసుకోవడమే గాక.. ఆ సందర్భంగా ఆగ్రహంతో స్పందించిన తీరు, సిజెఐ చేసిన వ్యాఖ్యలు దేశాన్ని కుదిపేశాయి. 'న్యాయవ్యవస్థ అధికారాన్ని అణచివేసేలా, గౌరవాన్ని కించపర్చేలా, ఉద్దేశ్య పూర్వకంగా చేసిన కుట్రగా ఇది కనిపిస్తోంది. దీనిని పట్టించుకోకుండా వదిలేస్తే ప్రజలు, యువత మనసుల్లో న్యాయవ్యవస్థ పవిత్రత దెబ్బతినే అవకాశం ఉంది.' అని విచారణ సందర్భంగా సిజెఐ అన్న వ్యాఖ్యలు అక్షర సత్యాలు. జవాబుదా రీతనం ఏర్పడేంతవరకు ఈ వ్యవహారాన్ని మేం వదలిబెట్టం. దీని వెనుక ఎవరున్నారో మేం తెలుసుకోవాలనుకుంటున్నామని సిజెఐ అనడం చూస్తుంటే..ఎంతటి నిర్లక్ష్యం ఉందో తేటతెల్లం అయ్యింది. ఈ వ్యవహారంతో కేంద్ర ప్రభుత్వం అత్యున్నత న్యాయస్థానానికి బేషరతుగా క్షమాపణలు చెప్పవలసి వచ్చింది. ఆ చాప్టర్లను ఇద్దరు వ్యక్తులు రూపొందించారని, వారు యుజిసి లేదా మరే మంత్రిత్వ శాఖతోనూ కలిసి పనిచేయడం లేదని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వివరణ ఇచ్చారు.ఆ పాఠ్యాంశాన్ని ముద్రించిన ఎనిమిదో తరగతి సాంఘిక శాస్త్రం పాఠ్యపుస్తకాన్ని పూర్తిగా నిషేధిం చాలని, ఇప్పటికే ప్రచురితమైన పుస్తకాలను వెనక్కి తీసుకోవాలని ధర్మాసనం ఆదేశించడం ద్వారా ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని గట్టిగా నిలదీసినట్లు అయ్యింది. అయితే 8వ తరగతి పాఠ్యాంశం వంటిది హఠాత్పరి ణామం కాదు. గత దశాబ్ద కాలంగా ఎన్‌సిఇఆర్‌టి, ఇతర కేంద్ర ప్రభుత్వ పరిధిలోని సంస్థల చర్యలు తరచు వివాదాస్పదంగా మారుతున్న విషయం అందరికీ తెలిసిందే! పాఠ్యాంశాల్లో కొన్ని తొలగింపులు, అర్థరహిత మైన చేర్పులతో మీడియాలో పతాక శీర్షికల్లో వస్తూనే ఉన్నాయి. ఆయా సందర్భాల్లో చరిత్రకారులు, సామాజిక శాస్త్రవేత్తలూ వాటిని ఎత్తిజూపి ప్రజలు, ప్రభుత్వ దృష్టికి తీసుకొస్తున్నారు. ఇప్పుడు నేరుగా న్యాయ వ్యవస్థనే టార్గెట్ చేయ డం, సుప్రీం ధర్మాగ్రహంతో కేంద్రం ఆత్మరక్షణలో పడింది. నేరుగా ప్రధానమంత్రి కార్యాలయమే రంగంలోకి దిగి నష్ట నివారణ చర్యలు చేపట్టవలసి వచ్చింది. ఈ రెండు వ్యవహారాల్లో కేంద్రం నేరుగా దొరికి పోయింది. కేజ్రీవాల్‌ను అణచివేసే కుట్ర జరిగిందన్న ఇక్కడ తెలిసిపోయింది. అన్నా హజారే చేపట్టిన అవినీతి వ్యతిరేక ఉద్యమంలో పుట్టుకుని వచ్చిన కేజ్రీవాల్ ఢిల్లీ ముఖ్యమంత్రి అయ్యారు. పంజాబ్‌లో పాగా వేశారు. దేశంలో అనేక చోట్ల ఉనికి చాటుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలో ఆయనను అవినీతి ముద్రతో అణివేసే ప్రయత్నం జరిగిందన్న వాదనలు వచ్చాయి. తెలంగాణలో కెసిఆర్ తనయ కవితను కూడా ఇందులో చేర్చారు. నిజానికి ఈ కేసు బలంగా ఉంటే కోర్టు ఇంత తీవ్రంగా వ్యాఖ్యలు చేసివుండేది కాదు. రాజకీయంగా తీసుకునే నిర్ణయాలకు సిబిఐ, ఇటి లాంటి వ్యవస్థలను దుర్వినయోగం చేయడం తగదు. ఇప్పటికైనా కేంద్రం తగు జాగ్రత్తలు తీసుకుని ప్రజలకు మేలుజరిగే మంచి పనులపై దృష్టి సారించాలి. అక్రమార్కులపై ఉక్కుపాదం మోపాలి. అందుకు సమర్థవంతులైన అధికారులను నియమించుకోవాలి.

# ఘనంగా పుట్ట నారాయణ 48వ వర్ధంతి ఘన నివాళులు



(తెలంగాణ అవతరణ ప్రతినిధి గోదావరిఖని) అమరుడు పుట్ట నారాయణ 48వ వర్ధంతిని గోదావరిఖని మార్కండేయ కాలనీస్నేహ సాహితీ గ్రంథాలయంలో హాలో ఆదివారం రాత్రి అమరుని వర్ధంతి సభ నిర్వహించారు.. పోలీసు కాల్పుల్లో మృతి చెందిన అమరుడు పుట్ట నారాయణ 48వ వర్ధంతిని స్నేహ సాహితీ గ్రంథాలయంలో నిర్వహించారు.. పుట్ట నారాయణ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు అమరహే పుట్ట నారాయణ అంటూ నినాదించారు. వివరాల్లోకి వెళ్తే గోదావరిఖనికి సమీపంలోని ముస్త్యాల గ్రామానికి చెందిన రైతు కుటుంబీకుడు సింగరేణి ఉద్యోగస్తుడు రామగుండం డివిజన్ 6 ఇంక్లైన్ లో కోల్ పిల్లర్ గా పనిచేస్తుండేవాడు.5-4-1978 నా మొదటి షిఫ్ట్ ముగించుకొని గోదావరిఖని ప్రధాన చౌరస్తా సింగరేణి సూపర్ బజార్ న్యూ అశోక్ టాకీస్ సమీపమునకు వచ్చినాడు అప్పటికే ప్రజలు బంధు నిర్వహిస్తున్నారు ఆ బందును నివారించడానికి... పోలీసులు లాఠీలతో ప్రజలను కొడుతున్నారు అక్కడ అంత ఘర్షణ వాతావరణం ఒక్కసారిగా పోలీసులు తుపాకులు ఎక్కుపెట్టి ప్రజలపై కాల్పులు జరిపినారు ఆ కాల్పుల్లో గని కార్మికుడు పుట్ట నారాయణ అమరుడయ్యాడు. అంతకు ముందు జరిగిన సంఘటన మార్చి 29 1978 నా అర్ధరాత్రి హైదరాబాదులో రమీజాబీ జంటను ఖాకీలు దౌర్జన్యంగా హైదరాబాదులోని నల్ల గుంట పోలీస్ స్టేషన్ కు తీసుకపోయి ఆమెను బలాత్కారం చేసి అతనిని కొట్టి చంపినారు ఆ సంఘటన రాష్ట్రమంతట నిరసనలు బందులకు దారితీసింది అందులో భాగంగా గోదావరిఖనిలో బందు నిర్వహించినారు..ఆ సంఘటనలో సింగరేణి కార్మికుడు పుట్ట నారాయణ అమరుడయ్యాడు అమరత్వాన్ని పురస్కరించుకొని ప్రతి ఏటా వర్ధంతి సంస్మరణ సభ కుటుంబ సభ్యులు బంధుమిత్రులు వివిధ వర్గాల వారు నిర్వహిస్తారు. ఈ సంఘటనకు ఆనాటి ప్రభుత్వం వారి కుటుంబంలోని ఒకరికి ఉద్యోగము నష్టపరిహా అన్ని విధాల ఆదుకుంటామని హామీ ఇచ్చింది కానీ నేటికీ అది నెరవేరు లేదు..ఈ వర్ధంతి సభకు విచ్చేసిన వివిధ సంఘాల నాయకులు మాట్లాడారు. అమరుడు పుట్ట నారాయణ కుటుంబం ప్రభుత్వానికి అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా ఆచరణకు నోచుకోకపోవడం విచారకరమని మంత్రి శ్రీధర్ బాబును కలిసిన కూడా సమస్య పరిష్కారం చేయకపోవడం నాయకుల ప్రభుత్వాల వైఫల్యం అని నాటి అధికార కాంగ్రెస్ పార్టీ నేటి అధికార కాంగ్రెస్ పార్టీ ఇప్పటికైనా ఆ కుటుంబాలను ఆదుకోవలసి బాధ్యత కుటుంబంలోని ఒకరికి ఉద్యోగము నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు... అదేవిధంగా మందమరి ప్రాంతానికి చెందిన సింగరేణి కార్మికుడు మల్యాల చంద్రారెడ్డిని నస్పూర్ పోలీసులు రాత్రి ఇంట్లో నుంచి తీసుకెళ్లి నక్సలైట్ వన్ టూ కొట్టి చంపినారు ఈ సంఘటన సుమారు 30 ఏళ్ల క్రితం ఇప్పటికి ఆకుటుంబంలో ఉద్యోగం ఇవ్వలేదు.. అదే ప్రాంతానికి చెందిన జోగు మధుకర్ అడివిలోకి కట్టలేక పోతే నక్సలైట్ అని కాల్చి చంపినారు ఈ సంఘటన సుమారు 24 సంవత్సరాల క్రితం జరిగింది. మంథని ప్రాంతానికి చెందిన బిరుదు సమ్మయ్యను 2005 సంవత్సరంలో మధ్యాహ్నం ఇంట్లో నుంచి పట్టుకపోయి గాడిదల గండి ప్రాంతంలో నక్సలైట్ అని కాల్చి చంపినారు... ఇలా చెప్పుకుంటూ పోతే అనేక సంఘటనలు ప్రభుత్వము పోలీసు వ్యవస్థ ఈ విధంగా ప్రజలను పొట్టన పెట్టుకుంటూ కాల్చి చంపుకుంటూ రక్తం తాగుతున్న నరరూప రాక్షసులుగా ఈ రాజ్యం పరిపాలిస్తున్నది ఇలాంటి కుటుంబాలను ఆదుకునే ఆదుకునే నాయకులే కరువైనారు అంటే ఇది ప్రజాస్వామ్యమే అంటామా ?.. ప్రతి ఒక్కరు ఆలోచన చేయాలని అన్నారు. ఆదివారం ఉదయం అమరుడు పుట్ట నారాయణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో "ఖని"ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో పేషంట్లకు పండ్లు పంపిణీ చేశారు. ఈ వర్ధంతి సందర్భంగా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మెమొంట్స్ శాలువలతో వారిని సత్కరించారు. అమరుడు పుట్ట నారాయణ సోదరుడు పుట్ట రాజన్న ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వర్ధంతి సభలో పాల్గొన్నవారు. స్నేహ సాహితీ వ్యవస్థాపకులు ఏలేశ్వరం వెంకటేశం. రాష్ట్ర పౌర హక్కుల సంఘం సహాయ కార్యదర్శి మాదన కుమారస్వామి. జెవి రాజు. ఎక్స్ ఎస్ ఐ పోశయ్య, దుర్గం ప్రమీల-నాగేష్,మాజీ సర్పంచ్ గోశిక చంద్రయ్య. ఎం సురేష్. శంకర్. తదితరులు పాల్గొన్నారు.

# వందలాది ప్రేక్షకుల మధ్య ముగిసిన డాక్టర్ అంబేద్కర్ కళారూపం నాటక ప్రదర్శన





(తెలంగాణ అవతరణ ప్రతినిధి గోదావరిఖని) సామాజిక సమతా వేదిక రామగుండము ఆధ్వర్యంలో డాక్టర్ అంబెద్కర్ గారి జీవితం పై ప్రదర్శించబడిన కళారూపం వందలాది వీక్షణాల మధ్య విజయవంతంగా ముగిసింది.బాబా సాహెబ్ పుట్టుక నుండి అయన రాజ్యాంగ రచన అనంతరం అయన ఆవేదన వరకు, మరియు అయన ఆవేదన నుండి సబ్బండ వర్గాలు చేదించాల్సిన లక్ష్యం వరకు కళ్లకు కట్టినట్టు సాక్షాత్తు డాక్టర్ అంబెద్కర్ మనముందుకు వచ్చినట్టు లేదా పాత్ర దారుణ్ణి స్వయంగా బాబా సాహెబ్ ఆవహించి మనకు చెప్పినట్టు భావోద్వాగానికి గురవడం జరిగింది. బాబాసాహెబ్ అవమానాలు మొదలు తల్లి రమాబాయి కష్టాన్ని చూసి కళ్ళు చెమర్చని మనిషి లేడు. ముఖ్యంగా తన కుమారుడు గంగాధర్ మరణం.. తల్లి రమాబాయి చిరిగిన జాకెట్ కనపడకుండా బ్లాంకెట్ కప్పుకున్న సన్నివేశం ప్రతి ఒక్కరికి కన్నీళ్లు తెప్పించడం జరిగింది.. కర్తవ్యాన్ని బోదిస్తూనే అంబేద్కర్ ను కొందరి వాడుగా కాకుండా అందరి వాడు ఎలా అయ్యాడో మనకు ఈ కళారూపం ద్వారా తెలియజెప్పడం జరిగింది. అలాగే సబ్బండ వర్గాల అభ్యున్నతికి ఆయన పడిన కష్టాన్ని, దేశ హితం



కోసం ఆయన తపనను తెలియ చెప్పాలనే ఉద్దేశంతో ఎన్నో వ్యయ ప్రయాసాలకు ఓర్చి గోదావరిఖని చౌరస్తాలో సామాజిక సమతా వేదిక నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో గుమ్మడి కుమారస్వామి, మాజీ శాసనసభ్యులు కోరుకంటి చందర్, కవ్వంపల్లి స్వామి పులిమోహన్, జేవి రాజు పర్లపెల్లి రవి, పెంట రాజేష్, చింతకింది సంపత్, కొలుగూరి సాయి కుమార్, కాసిపేట శివాజీ, నిట్టూరి రాజు, చ్ రుశేంద్రం,కిరణ్ జీ, పర్లపల్లి అభి, కళ్యాణ్, రవితేజ, శ్రీకాంత్, పవన్, తదితరులు పాల్గొన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడ్డ వ్యక్తులతో వినూత్న కార్యక్రమం - అనాధాశ్రమం బియ్యం, పండ్ల పంపిణీ

తెలంగాణ అవతరణ, మార్కండేయ కాలనీ, ఏప్రిల్ 06:రామగుండం ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ బి.రాజేశ్వరరావు ఆధ్వర్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్ లో దొరికిన 10 మందిని, గోదావరిఖని సెకండ్ అడిషనల్ మేజిస్ట్రేట్ వెంకటేష్ దుర్వ ముందు సోమవారం హాజరుపరచగా వారిలో 8 మందికి రు.16000 ఫైన్ వేయగా, రెండోసారి దొరికిన ఇద్దరు వ్యక్తులకు రు.2000 రూపాయలు ఫైన్ వేశారు. అదేవిదంగా కమ్యూనిటీ సర్వీస్ లో భాగంగా అనాధాశ్రమంలో వాళ్ళ అవసరాలకు ఉపయోగపడే వస్తువులను ఇవ్వమని ఉత్తర్వులు ఇవ్వడం జరిగింది. రామగుండం ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ బి. రాజేశ్వరరావు ఆధ్వర్యంలో అమ్మ పరివార్ అనాధాశ్రమంలో 75 కిలోల బియ్యం ఇవ్వడం జరిగింది. దానితోపాటు పండ్లు కూడా ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ట్రాఫిక్ సిఐ మాట్లాడుతూ వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, ఫోర్ వీలర్ నడిపేటప్పుడు సీట్ బెల్ట్ ధరించాలని, వాహనానికి సంబంధించిన పత్రాలు ఉండాలని మరియు వాహనం తాగి నడపరాదని మరియు మైనర్లకు వాహనం ఇవ్వరాదని ట్రాఫిక్ రూల్స్ తప్పకుండా పాటించాలని తెలియజేశారు.




# ఆకుతోట చంద్రమ్మకి ఘన నివాళి అర్పించిన రామ రాజేష్ ఖన్నా



వరంగల్ జిల్లా 06 ఏప్రిల్ 2026వరంగల్ జిల్లాలోని నాగేంద్ర నగర్ మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ సమీపం ఇంటిదగ్గర నిర్వహించిన దశ దిశ కర్మ కార్యక్రమానికి జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటియుసి అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా హాజరై చిత్రపటానికి పూల మాలవేసి నివాళులు అర్పించారు. ఇట్టి కార్యక్రమంలో ఎన్ హెచ్ ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నూకల అంజి యాదవ్, వరంగల్ జిల్లా పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ గూడెపు ప్రభాకర్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బీజేపీ 47వ ఆవిర్భావ దినోత్సవం



తెలంగాణ అవతరణ, మార్కండేయ కాలనీ, ఏప్రిల్ 06:రామగుండం నియోజవర్గం లో బీజేపీ శ్రేణులు 47వ బీజేపీ అవిర్భావ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ రామగుండం నియోజకవర్గం నాయకులు సోమారపు లావణ్య అరుణ్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించడం జరిగింది. బీజేపీ సభకా సాత్ సబ కా వికాస్ ప్రజల కోసం అని, బీజేపీ కి పరోక్షంగా ప్రత్యక్షంగా కార్యకర్తలు ఎంతో కష్టపడుతూ పార్టీ ని ముందుకు తీసుకువెళ్తున్నారని తెలిపారు. వారందరికీ అభినందనలు,కృతజ్ఞతలు తెలుపారు. మోదీ ఎల్లవేళలా అండగా నిలవాలని బీజేపీ కార్యకర్తలను ఉద్దేశించి అన్నారు. ఈ కార్యక్రమంలో లో బీజేపీ కార్పొరేటర్ కంటెస్టెంట్ నాయకులు చల్లా శోభ, రాజేష్ శర్మ, అమరేశ్వర్ రావు, మహావాది రామన్న, అడ్వకేట్ చంద్రశేఖర్, మాజీ మండల అధ్యక్షులు నవీన్, ఎయిర్టెల్ సునీల్, కుమారస్వామి, కుమారస్వామి, బూడిద రమేష్, సాగర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# ఖనిలో ఘనంగా పోచమ్మ బోనాలు..

తెలంగాణ అవతరణ, (మార్కండేయ కాలనీ ,ఏప్రిల్ 6)గౌడ సంఘం ఆధ్వర్యంలో గోదావరిఖని పట్టణంలో ఆదివారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. రామగుండం కార్పొరేషన్ పరిధిలోని వివిధ డివిజన్ ల నుండి గౌడ కులస్తులు డప్పు చప్పుళ్ళు, బ్యాండు భాజాలతో బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి పోచమ్మ అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఈ కార్యక్రమంలో రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహంకాళి స్వామి, కార్పొరేటర్లు గట్ల రమేష్, ముస్తఫా, గౌడ సంఘం నాయకులు హనుమంతు గౌడ్, కోట రవి గౌడ్,బాలసాని స్వామి గౌడ్, మంద రమేష్ గౌడ్, వంగ శ్రీనివాస్ గౌడ్, అశోక్ గౌడ్, మాచిడి మహేందర్ గౌడ్, రవి గౌడ్,గున్నాల శ్రీధర్ గౌడ్, ఆరెల్లి కుమార్ గౌడ్, జనార్ధన్ గౌడ్, సంతోష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# రోడ్లపై ఇసుక, కంకర కుప్పలు పోస్తే జరిమానా తప్పదు - మేయర్ మహంకాళి స్వామి హెచ్చరిక




తెలంగాణ అవతరణ, గోదావరిఖని, ఏప్రిల్ 06: రాకపోకలకు ఆటంకం కలిగేలా రోడ్ల మీద ఇసుక కుప్పలు , కంకర కుప్పలు పోస్తే వాటిని తరలించిన ఛార్జీలు వసూలు చేయడంతో పాటు జరిమానా విధిస్తామని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి అన్నారు. వార్డు సందర్శన కార్యక్రమంలో భాగంగా డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య , స్థానిక కార్పొరేటర్ చిదురాల నాగరాజు తో కలసి సోమవారం 52 వ డివిజన్ కాకతీయ నగర్ లో పర్యటించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి నిర్మాణం కొరకు తెప్పించిన కంకర , ఇసుక కుప్పలు రోజుల తరబడి రోడ్లపై చెల్లా చెదురుగా ఉండడంతో వాహనాలకు దారి లేకుండాఇరుకుగా మారడంతో పాటు ప్రమాదాలకు గురువుతున్నట్లుగా తమ దృష్టికివచ్చిందని అన్నారు. తన పర్యటనలో భాగంగా ఒకరి ఇంటి ముందు రోడ్డు మీద ఇసుక కుప్ప ఉండడం గమనించి వెంటనే తొలగించుకోవాల్సిందిగా సదరు ఇంటి యజమానికి హెచ్చరికలు జారీ చేశారు. అలాగే దుకాణ యజమానులు కూడా తమ సామాగ్రి రోడ్డుపై కాకుండా తమ ఆవరణ లోపల ఉంచుకోవాలని సూచించారు. జి సి బి ,బ్లేడ్ ట్రాక్టర్ , బాబ్ కార్ట్ , 15 మంది డ్రెయిన్ క్లీనర్ల సేవలను ఉపయోగించుకొని కాకతీయ నగర్ లో ఉన్న పెద్ద మురుగు నీటి కాలువ లో సుమారు కిలో మీటర్ పూడిక తొలగించడంతో పాటు , కాలువ ప్రక్కన పెరిగిన పిచ్చి చెట్లు , చెట్ల కొమ్మలు తొలగించి పరిశుభ్రం చేశారు . మేయర్ మహంకాళి స్వామి అధికారులకు , సిబ్బందికి సూచనలు ఇస్తూ పూడిక తొలగింపు పని పూర్తి చేయించారు. దుర్వాసన , పాముల బెడద తో గత కొన్ని ఏళ్లుగా ఇబ్బంది పడుతున్న తాము కాలువ పూడిక తీత , పొదల తొలగింపు తో సమస్య తీరిపోయిందని పరిసరవాసులు హర్షం వ్యక్తం చేశారు. కాలువలో పూడిక చేరకుండా ఉండడానికి చెత్త వేయకుండా సహకరించాలని కాలనీ వాసులను మేయర్ స్వయంగా అభ్యర్థించారు. శిథిలమైన కాలువ పునర్నిర్మించాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలను ప్రక్కకు తరలించాలని ఆదేశించారు. రామగుండం నగరాన్ని అందంగా తీర్చిదిద్దాలనే ఎం ఎల్ ఎ , నగర పాలక సంస్థ పాలక వర్గం చేస్తున్న ప్రయత్నానికి ప్రతి ఒక్కరు సహకరించాలని అన్నారు ఈ సంధర్భంగా ఆయన వెంట పలువురు కార్పొరేటర్లతో పాటు నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి , ఎ ఇ. జమీల్ , టి పి ఎస్ నవీన్ , సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్ సానిటరీ ఇన్స్పెక్టర్ సంపత్ , జవాన్ దయాకర్ తదితరులు ఉన్నారు.

# రామగుండం ఆర్జీ-1 పరిధిలోని గనుల్లో డీడీఎంఎస్ (ఎలక్ట్రికల్) కమలేష్ చౌదరి పర్యటన



(తెలంగాణ అవతరణ ప్రతినిధి గోదావరిఖని) డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ మైన్ సేఫ్టీ , దక్షిణ మధ్య మండలం (హైదరాబాద్) ఎలక్ట్రికల్ విభాగం ఉప సంచాలకులు శ్రీ కమలేష్ చౌదరి గారు సింగరేణి రామగుండం ఏరియా-1 (=+1) పరిధిలోని పలు గనులను సందర్శించనున్నారు. ఈ సందర్భంగా ఇల్లందు గెస్ట్ హౌజ్ కు వచ్చిన వీరికి ఆర్జీ. 1 జియం శ్రీ డి లలిత్ కుమార్ గారు పుష్ప గుచ్చం అందజేసి స్వాగతం తెలిపారు. ఈ నెల ఏప్రిల్ 6 నుండి ఏప్రిల్ 9 వరకు నాలుగు రోజుల పాటు ఆయన ఈ ప్రాంతంలో సాధారణ తనిఖీలు నిర్వహించనున్నారు. శ్రీ కమలేష్ చౌదరి తన పర్యటనలో భాగంగా జీడీకే 2, 2ఎ గనులతో పాటు మరియు ఉపరితల ఓసి 5 ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తారు. గని కార్మికుల రక్షణే ధ్యేయంగా విద్యుత్ ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు మరియు సిబ్బందికి తగు సూచనలు చేయనున్నారు. ఈ కార్యక్రమములో ఏరియా ఇంజనీర్ రామమోహనరావు, ఓసి. 5 ప్రాజెక్ట్ ఇంజనీర్ రమేష్, స్టాటుటరి మేనేజర్ రమేష్ గార్లు పాల్గొన్నారు.

# అనిత ఎందుకో లాస్ట్..!




విశాఖపట్టణం: ఏపీలోటీడీపీ కూటమి ప్రభుత్వం దూకుడు మీద ఉంది. ఒక ప్రణాళిక ప్రకారం ప్రభుత్వ పాలన కొనసాగుతోంది. ప్రతి 15 రోజులకు మంత్రి మండలి సమావేశం. ప్రతి నెల రోజులకు ఒకసారి కలెక్టర్ల రివ్యూ కొనసాగుతూ వస్తోంది. అదే సమయంలో మంత్రులకు ర్యాంకింగ్, వారి పనితీరు మదింపు వంటి విషయంలో సీఎం చంద్రబాబు ముందు ఉంటున్నారు. వారికి ర్యాంకింగ్స్ ఇస్తున్నారు. తాజాగా కలెక్టర్ల రివ్యూలు మంత్రులకు ర్యాంకింగ్స్ ఇచ్చారు చంద్రబాబు. ఈ ర్యాంకింగ్స్ లో మంత్రి కింజరాపు అచ్చెనాయుడు తొలి స్థానంలో నిలిచారు. మంత్రి వంగలపూడి అనిత చివరి స్థానంలో ఉన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాలుగో స్థానంలో నిలిచారు. మంత్రుల శాఖలకు సంబంధించి ఫైళ్ళ క్లియరెన్స్ విషయంలో ఈ ర్యాంకింగ్స్ ఇచ్చారు సీఎం చంద్రబాబు. మంత్రుల శాఖల ప్రగతిలో ఈ ఫైల్ క్లియరెన్స్ కీలక పాత్ర పోషిస్తుంది. అందుకే సీఎం చంద్రబాబు దీనిపైనే స్పెషల్ ఫోకస్ పెడుతున్నారు. మంత్రుల పనితీరుపై మదింపు.. అమరావతిలో కలెక్టర్ల సమావేశం తొలి రోజున మంత్రుల పనితీరుపై హాట్ కామెంట్స్ చేశారు సీఎం చంద్రబాబు. ఆయా శాఖల్లో ఫైళ్ళ క్లియరెన్స్ ఎంత వేగంగా జరుగుతుందని అంశంపై మిత్రులందరికీ రేటింగ్స్ ప్రకటించారు. తొలి స్థానంలో కింజరాపు అచ్చెనాయుడు నిలిచారు. ఆ తరువాత స్థానాల్లో వరుసగా నిమ్మల రామానాయుడు, కొండపల్లి శ్రీనివాస్ ఉన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాలుగు స్థానంలో నిలిచారు. మంత్రి వంగలపూడి అనిత చివరి స్థానంలో నిలిచారు. మంత్రులు తమ ఫైళ్లను క్లియర్ చేసేందుకు ఎంత సమయం తీసుకుంటున్నారో చంద్రబాబు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పనులు, తీసుకున్న నిర్ణయాలు వేగంగా పూర్తి అయ్యేలా త్వరగా ఫైళ్లను క్లియర్ చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు సీఎం చంద్రబాబు. పాలనలో వేగం పెంచడం ద్వారా.. రాష్ట్ర ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని తమ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని ఆయన వెల్లడించారు.ప్రతి నెల రోజులకు ఒకసారి కలెక్టర్ల సమావేశం జరపడం ఆనవాయితీగా పెట్టుకున్నారు సీఎం చంద్రబాబుఅందులో భాగంగా నిన్ననే అమరావతిలో కలెక్టర్ల సదస్సు ప్రారంభమైంది. ఈరోజు కూడా అది కొనసాగనుంది. కీలక అంశాలపై చర్చలు జరపనున్నారు. ముఖ్యంగా వైద్య ఆరోగ్యశాఖ పై ప్రత్యేక ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. శాఖల ఆదాయంపై కూడా సమీక్షిస్తారు. రాష్ట్ర విద్యారంగం తో పాటు ఉపాధి అవకాశాలపై కూడా చర్చించనున్నారు ఈరోజు సమావేశంలో. కోర్టులో ఉన్న కేసులు, న్యాయశాఖ పరిధిలో ఉన్న అంశాల పైన అధికారులు సీఎంకు వివరాలు అందించనున్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు సంబంధించి కీలక నిర్ణయం కూడా ఈరోజు తీసుకోనున్నారు. తొలిరోజు మంత్రులకు ర్యాంకింగ్స్ ఇవ్వగా.. ఈరోజు అధికారులకు ర్యాంకింగ్స్ ఇవ్వనున్నారు సీఎం చంద్రబాబు.

# ఈ సారి వారసులకు షాక్ తప్పదా?

తిరుపతి: 2024లో ఘోర పరాజయం. ఆల్‌మోస్ట్ వైసీపీ శూన్యం నుంచి తిరిగి బౌన్స్ బ్యాక్ కావాల్సి ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రయోగాలు చేసే పరిస్థితి లేదంటున్నారట వైసీపీ అధినేత జగన్. నియోజకవర్గాలపై పట్టున్న నేతలు..రాజకీయంగా అనుభవం ఉన్న లీడర్లు, కుల బలం ఉన్న నేతలకే మళ్లీ టికెట్ ఇచ్చే యోచనలో ఉన్నారట. కానీ చాలామంది నేతలు..వయోభారమనో..తాము యాక్టీవ్‌గా ఉన్నప్పుడే వారసులను రాజకీయాల్లోకి తేవాలని ఆశపడుతున్నారట. అందుకే తమ కొడుకు, కూతురుకు టికెట్ కావాలని ఇప్పటినుంచే అర్జీలు పెట్టుకున్నారట. ఇలా వైసీపీలో చాలామంది లీడర్ల వారసులు రాబోయే ఎన్నికల్లో పోటీకి సిద్ధపడుతున్నారట. 2024లోనే టికెట్ ఆశించిగా కొందరికి తప్ప..మిగతా చోట్ల తండ్రులనే రంగంలోకి దించారు. కొన్ని చోట్ల అధినాయకత్వాన్ని మెప్పించి ఒప్పించి కొందరు లీడర్లు తమ వారసులకు టికెట్లు ఇప్పించుకున్నా పరాభావం తప్పలేదు. దాంతో వైసీపీ హైకమాండ్ ఆలోచనలు మారాయని అంటున్నారు. ఈసారి ఎన్నికలు 2024 కంటే ఎంతో ప్రతిష్టాత్మకమైనవి అని వైసీపీ పెద్దలు భావిస్తున్నారట. దాంతో వారసులకు నో చాన్స్ అన్న చర్చ అయితే ఫ్యాన్ పార్టీలో జోరుగా సాగుతోందని చెబుతున్నారు.గత ఎన్నికల్లో తిరుపతి నుంచి భూమన కరుణాకర్‌రెడ్డి తనయుడు భూమన అభినయ్ రెడ్డి పోటీ చేసి ఓడిపోయారు. అలాగే చంద్రగిరి నుంచి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, మచిలీపట్నం నుంచి పేర్ని కిట్టూ పోటీ చేసినా గెలవలేకపోయారు. దాంతో ఈసారి వీరి ప్లేస్ లో తండ్రులనే పోటీకి రెడీ కావాలని వైసీపీ హైకమాండ్ సూచించిందని అంటున్నారు. ఈ క్రమంలోనే తిరుపతి మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి తిరిగి యాక్టివ్ అయ్యారని చర్చించుకుంటున్నారు. భూమన పార్టీ నేతలతో కూడా ఎక్కువగా సమావేశాలు జరుపుతున్నారు. వచ్చే ఎన్నికల్లో తాను పోటీ చేస్తానని కూడా సంకేతాలు ఇస్తున్నారట.తన కుమారుడికి రాజకీయంగా ఎంతో భవిష్యత్తు ఉందని వైసీపీకి రాబోయే ఎన్నికలు కీలకం కావడంతో తానే పోటీకి సిద్ధమవుతున్నానని చెబుతున్నారట. ఇక మాజీ మంత్రి పేర్ని నాని అయితే మచిలీపట్నంలో తన కుమారుడినే పోటీకి పెట్టాలని చూస్తున్నారట. చెవిరెడ్డి భాస్కరరెడ్డి అదే ఆలోచనలో ఉన్నారని..మరోసారి మోహిత్‌రెడ్డినే బరిలోకి దించబోతున్నారట.వీళ్లు ఆల్రెడీ పోటీ చేసి ఓడిన నేతలు. వాళ్లకు టికెట్ ఇచ్చేందుకు వైసీపీ అధిష్టానం సుముఖంగా లేదంటున్నారు. అలాంటిది మరికొందరు నేతలు రాబోయే ఎన్నికల్లో తమ కూతురు, లేదా కొడుకును బరిలోకి దింపాలనుకుంటున్నారు. అయితే కీలక స్థానాలలో తండ్రులే పోటీ పడితే మంచి రిజల్ట్స్ వస్తాయన్నది వైసీపీ హైకమాండ్ ఆలోచనగా చెబుతున్నారు.

# ఉద్దానం బాధితులకు ఊరట



## అందుబాటులోకి పలాస కిడ్నీ సెంటర్

శ్రీకాకుళం, : శ్రీకాకుళం జిల్లా ఉద్దానం ప్రాంత ప్రజల దశాబ్దాల కల నెరవెరబోతోంది. కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్న రోగులకు అండగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పలాసలో చారిత్రాత్మక అడుగు వేసింది. పలాస కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌లో రాష్ట్రంలోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా, తొలి కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఈ ఆపరేషన్‌ని నిర్వహించనున్నారు. దేశంలోని ప్రముఖ కిడ్నీ మార్పిడి నిపుణులు ప్రత్యేకంగా పలాసకు విచ్చేసి స్థానిక వైద్యులతో కలిసి ఈ క్లిష్టమైన పక్రియను విజయవంతంగా పూర్తి చేయనున్నారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్యం అందించడమే ప్రధాన లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కృషి చేస్తోంది. పలాస సెంటర్ అభివృద్ధికి రూ. 12 కోట్ల నిధులు మంజూరు చేసి, ఆపరేషన్ థియేటర్ల ఆధునికీకరణ, డయాలసిస్ యూనిట్లు, పోస్ట్ - ఆపరేటివ్ కేర్ సెంటర్లను బలోపేతం చేసింది. పేద రోగులకు ఎక్కువ ఖర్చుతో ప్రైవేట్ ఆస్పత్రుల్లో పొందే కిడ్నీ మార్పిడి చికిత్సను పలాస కేంద్రంలోనే ప్రభుత్వం బాధ్యతగా నిర్వహిస్తోంది. గతంలో కిడ్నీ సమస్యల చికిత్స కోసం ఉద్దానం వాసులు విశాఖపట్నం, హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లేవారు. ఇప్పుడు పలాసలోనే ఈ సదుపాయం రావడం వల్ల ప్రయాణ భారం తగ్గుతోండటంతో పాటు అత్యవసర సందర్భాల్లో ప్రాణాలు కాపాడే అవకాశాలు మెరుగుపడతాయి. కిడ్నీ రీసెర్చ్ సెంటర్ ద్వారా నిరంతరం స్క్రీనింగ్ పరీక్షలు, మందుల పంపిణీ జరుగుతుంది. పేద రోగులకు ప్రైవేట్ ఆస్పత్రులలో లక్షల రూపాయలు ఖర్చయ్యే చికిత్స ఇక్కడ ఉచితంగా లేదా రాయితీపై అందుబాటులో ప్రభుత్వం తీసుకువచ్చింది.

# అమెరికా విమాన వాహకనౌక అబ్రహం లింకన్‌పై దాడి ప్రకటించిన ఇరాన్..తిప్పి కొట్టిన అమెరికా

టెహ్రాన్: అమెరికా విమాన వాహకనౌక అబ్రహం లింకన్‌పై దాడి చేశామని ఇరాన్ ప్రకటించింది. తమ బాలిస్టిక్ క్షిపణులు ఈ యుద్ధ విమానాన్ని ఢీకొట్టాయని వెల్లడించింది. దాంతో అది పనిచేయడం లేదని, గల్ఫ్ జలాల నుంచి వెనక్కి తగ్గిందని పేర్కొంది. అయితే అమెరికా ఈ ప్రకటనను తోసిపుచ్చింది. ఇరాన్‌పై అమెరికా చేస్తోన్న 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'కి ఈ నౌక మద్దతు ఇస్తూనే ఉందంటూ ఇరాన్ ప్రకటనలను ఖండించింది. ఈమేరకు అమెరికా సెంట్రల్ కమాండ్ 'ఎక్స్' వేదికగా పోస్టు పెట్టింది.

అమెరికా మీడియా కథనాల ప్రకారం.. అబ్రహం లింకన్‌కు అతిదగ్గరగా ఓ ఇరాన్ పడవ వచ్చింది. దానిని గుర్తించిన అమెరికా దళాలు కాల్పులు జరిపాయి. అయితే ఈ ఘటనలో యూఎస్ నౌక దెబ్బతిన్నదా, లేదా అని మాత్రం పేర్కొనలేదు. ఇక, ఇరాన్‌తో యుద్ధం ప్రారంభం కావడానికి ముందు ట్రంప్ సేనలు దీనిని దక్షిణ చైనా సముద్రం నుంచి పశ్చిమాసియాకు తరలించాయి. ఇందులో ఎనిమిది స్క్వాడ్రన్ల యుద్ధ విమానాలు ఉంటాయి. అబ్రహం లింకన్‌పై దాడి చేశామని ఇరాన్ ప్రకటించడం ఇదే తొలిసారి కాదు. యుద్ధం ప్రారంభమైన మూడు రోజుల తర్వాత నాలుగు క్షిపణులతో దాడి చేశామని చేసిన ప్రకటన కలకలం సృష్టించింది. అయితే ఆ ప్రకటనలో నిజం లేదని అప్పుడు కూడా అమెరికా తోసిపుచ్చింది. ఇరాన్ వద్ద భారీస్థాయిలో హైపర్‌సోనిక్, నౌకా విధ్వంసక క్షిపణులు ఉన్నప్పటికీ అవి అమెరికన్ విమాన వాహక నౌకను తాకడం దాదాపుగా అసాధ్యమనే చెబుతుంటారు. విమాన వాహక నౌక ప్రధాన బలం దాని మీద ఉండే యుద్ధ విమానాలే. యూఎస్ఎస్ అబ్రహం లింకన్‌పై ఎఫ్/ఏ-18 సూపర్ హార్నెట్, ఎఫ్-35సి స్టెల్త్ యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు, డ్రోన్లు సహా అనేక విమానాలు ఉన్నాయి. ఇవి శత్రువుపై దాడి చేయడంతోపాటు విమాన వాహకనౌకను రక్షించే సామర్థ్యాన్ని కలిగిఉన్నాయి. పోరు సమయంలో విమాన వాహక నౌక సాగరంలో స్థిరంగా ఉండదు. గంటకు 60 కిలోమీటర్ల వేగంతో కదులుతుంటుంది. రియల్‌టైమ్ ఉపగ్రహ నెట్‌వర్క్ లేకుండా దీని జాడను ఎప్పటికప్పుడు పసిగట్టడం కష్టం. యూఎస్ఎస్ అబ్రహం లింకన్ ప్రస్తుతం అరేబియా సముద్రంలో.. ఇరాన్ తీరానికి దూరంలో వ్యూహాత్మక ప్రదేశంలో సంచరిస్తున్నట్లు తెలుస్తోంది.

ఇరాన్ సమీపంలో మోహరించిన అమెరికా విమాన వాహక నౌక యూఎస్ఎస్ జెరాల్డ్ ఆర్ ఫోర్డ్ లో మంటలు చెలరేగినట్లు తెలుస్తోంది. 'జెరాల్డ్‌లోని లాండ్రీ ప్రదేశాల్లో ఈ మంటలు చెలరేగాయి. అయితే అందుకు యుద్ధం కారణం కాదు. ఆ మంటలను ఆర్పేశాం. నౌకలోని ప్రొపల్షన్ ప్లాంట్‌కు ఎలాంటి డ్యామేజ్ జరగలేదు. గాయపడిన ఇద్దరు నావికులకు చికిత్స అందుతోంది. వారి ఆరోగ్యం నిలకడగా ఉంది. ఈ నౌక ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీలో భాగంగా ఎర్రసముద్రంలో తన సహకారాన్ని కొనసాగిస్తోందని సెంట్రల్ కమాండ్ వెల్లడించింది.

# రైతుల కోసం అనేక కార్యక్రమాలు అమలు

**పట్టిసీమ ద్వారా గోదావరి నీటిని కృష్ణాకు తరలింపు**

**అన్నదాత సుఖీభవ కింద రైతు ఖాతాలో ఏటా 20వేలు జమ**

**సూరంపల్లిలో అన్నదాత సుఖీభవను ప్రారంభించిన సిఎం చంద్రబాబు**



విజయవాడ, (ఆర్ఎన్ఎ): రాష్ట్రంలోని రైతులను ఆదుకుంటామని సీఎం చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. ఇప్పుడు ఒక్కో రైతుకు రూ. 6 వేలు ఇస్తున్నామన్నారు. రైతు ఖాతాలో ఏటా రూ. 20 వేలు జమ చేస్తున్నామని తెలిపారు. కేంద్రం రూ. 6 వేలు ఇస్తే.. మేం రూ. 14 వేలు ఇస్తున్నామని చెప్పారు. శుక్రవారం కృష్ణాజిల్లా గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గంలోని సూరంపల్లిలో అన్నదాత సుఖీభవ, పీఎం సుఖీభవ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొని.. రైతుల ఖాతాల్లోకి ఈ పథకానికి సంబంధించిన నిధులు విడుదల చేశారు. అనంతరం సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. రైతులు సైతం టెక్నాలజీ అందిపుచ్చుకుంటున్నా రన్నారు. రైతుల కోసం అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. పంటలకు సమయానికి సాగునీరు ఇస్తున్నామని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. పట్టిసీమ ద్వారా గోదావరి నీటిని కృష్ణా జలాలతో కలిపామని సీఎం చంద్రబాబు వివరించారు. ప్రధాని మోదీ అసోంలో ఉండి దేశంలోని రైతులందరి ఖాతాల్లో నగదు వేశారని.. ఇది టెక్నాలజీకి ఉండే మహిమ అని వివరించారు. అదే సమయంలో కేంద్రం ఇవ్వాల్సిన నగదు అక్కడ విడుదల చేస్తే.. మనం ఇక్కడ విడుదల చేశామని సీఎం చెప్పారు. అవన్నీ మీ ఖాతాల్లో ఇప్పుడు పరిశీలించుకునే పరిస్థితికి వచ్చిందంటే.. టెక్నాలజీ ఏ విధంగా పని చేస్తుందో మీరందరూ గుర్తుపెట్టుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రోజు ఎన్నికల ముందు తాను, పవన్ కళ్యాణ్ రాష్ట్రవ్యాప్తంగా తిరిగి మళ్ళీ రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేయడంతోపాటు రైతుల్ని పూర్తిగా ఆదుకుంటామని మాట ఇచ్చామని చెప్పారు. అందుకే సూపర్ సిక్స్ పథకాలతోపాటు ఇంకొన్ని సంక్షేమ కార్యక్రమాలు హామీ ఇచ్చామని పేర్కొన్నారు. ఆ తర్వాత బీజేపీ కూడా కలిసి ఎన్డీఏ కూటమిగా ఏర్పాటయ్యామని సీఎం చంద్రబాబు వివరించారు. గడిచిన ప్రభుత్వం ఏ విధంగా దగా చేసిందనే విషయాలు కూడా మనం ఎప్పటికప్పుడు గుర్తుపెట్టుకోవాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. ?ఈ రోజు మూడో విడతలో 46,85000 మంది రైతులకు ఒక్కొక్కరికి రూ. 6 వేలు డిపాజిట్ చేస్తున్నామని తెలిపారు. అటు కేంద్రం కానీ.. ఇటు రాష్ట్రం కానీ కలిపి మొత్తం రూ. 20 వేల అందిస్తున్నామన్నారు. ఈ విషయం రైతులందరూ గుర్తు పెట్టుకోవాలని సూచించారు. తాను రైతు బిడ్డనని.. మధ్యతరగతి కుటుంబంలో జన్మించి ఈ స్థాయికి వచ్చానని తెలిపారు. రైతు కుటుంబాలు ఇబ్బందుల్లో ఉండ కూడదనే తన ఆలోచన, తపన అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. సమైక్య ఆంధ్రప్రదేశ్‌లోనే వ్యవసాయానికి ప్రత్యేక బ్జడెట్ పెట్టించామని చెప్పారు. కృష్ణాజిల్లాలో నీళ్లు ఆలస్యంగా రావడం వల్ల తుఫాన్‌తో రైతులు నష్టపోయారని పేర్కొన్నారు. రాష్ట్ర విభజన తర్వాత పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు ఇవ్వడం ద్వారా పంటలను కాపాడామన్నారు. నేడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అప్పుల సుడిగుండంలో ఉందన్నారు. ఏపీ ఇమేజ్ దెబ్బ తిందని.. పెట్టుబడులు పెట్టే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం నుంచి వచ్చే నిధులు కూడా నిలిచిపోయేలా చేశారన్నారు. ఇరవై నెలల్లో ఒక్కో సమస్యను పరిష్కారం చేసుకుంటూ వస్తున్నామని సీఎం చంద్రబాబు వివరించారు. ఇన్ని సమస్యలు ఉన్నా.. మీకు న్యాయం చేసిన ప్రభుత్వం ఎన్డీఏ ప్రభుత్వమని ధైర్యంగా చెబుతున్నానన్నారు. 47లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించి 24 గంటల్లో రైతుల ఖాతాల్లో నగదు వేశామని పేర్కొన్నారు. ÷-రకృతి విపత్తుల సమయంలో ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చామని.. రూ. 300 కోట్లు నష్ట పరిహారం, రూ. 500 కోట్ల ధరల స్థిరీకరణకు కేటాయించామని గణాంకాలతో సహా సీఎం చంద్రబాబు వివరించారు. పక్కనే ఉన్న తమిళనాడు కానీ.. కర్ణాటక కానీ రైతులకు ఒక్క రూపాయి ఇవ్వలేదన్నారు. కానీ ఏపీలో రైతుకు గిట్టుబాటు ధర ఇచ్చిన ఏకైక ప్రభుత్వం.. ఎన్డీఏ ప్రభుత్వమని స్పష్టం చేశారు. పొగాకు, ఉల్లి రైతులను ఆదుకునేలా ఆర్థిక సాయం అందించామని చెప్పారు. మోటా, కోకో పంటలు దెబ్బ తింటే.. మద్దతు ధర ఇచ్చి రైతులను ఆదుకున్నామన్నారు. నష్టపోయిన రైతాంగానికి రూ. 1,338 కోట్లు అందచేశామని గుర్తు చేశారు. మేము విజన్ 2047 తయారు చేశాం.. ప్రధాని నేతృత్వంలో వికసిత్ భారత్, ఏపీ ప్రభుత్వం స్వర్ణాంధ్ర 2047 కల సాకారం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. మనకు స్వాతంత్ర్యం వచ్చి 2047 నాటికి వందేళ్లు అవుతుందన్నారు. ఆ సమయానికి మన దేశం, మన రాష్ట్రం అన్ని విధాలా అగ్రస్థానంలో ఉండాలని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు.


# రావిపూడి అనిల్ తో నవీన్ సినిమా ఫైట్






ఒక సినిమా తీసి సక్సెస్ ని సాధించాలంటే చాలా కష్టంతో కూడు కున్న పని ఎందుకంటే ఆ సినిమా కథ ఏ జానర్ కి చెందిందిఆ సినిమాను ప్రేక్షకుడికి నచ్చేట్టుగా ఎలా చేయాలి అని దర్శకుడు అనునిత్యం మథనపడుతూ ఒక బెస్ట్ ప్రొడక్ట్ ఇవ్వడానికి తీవ్రమైన ప్రయత్నం చేస్తాడు. ఇక ఇలాంటి సందర్భంలోనే ప్రస్తుతం నవీన్ పోలిశెట్టి లాంటి యంగ్ హీరో సైతం ఒక బెస్ట్ సినిమాను ప్రేక్షకులకు అందించడానికి తీవ్రమైన ప్రయత్నం చేస్తున్నాడు. ఈయన సినిమా సినిమాకిమధ్య చాలా ఎక్కువ గ్యాప్ తీసుకుంటాడు. తక్కువ సినిమా లు చేసిన కూడా ప్రేక్షకుడికి నచ్చే సినిమాలు చేయాలనే ఆయన ముందుకు సాగుతున్నాడు. 'ఏజెంట్ సాయి శ్రీనివాస్ ఆత్రేయ', 'జాతి రత్నాలు', 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' లాంటి సినిమాలతో మంచి గుర్తింపును సంపాదించుకున్నాడు. ఇప్పుడు 'అనగనగా ఒక రాజు' అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమ వుతున్నాడు. సంక్రాంతి కానుకగా జనవరి 14వ తేదీన ఈ సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. ఇక ఇలాంటి క్రమంలోనే దసర పండుగను పురస్కరించుకొని అనగన గా ఒక రాజు సినిమాకు సంబంధించిన ప్రమోషన్స్ ని చేపట్టారు. నవీన్ పోలిశెట్టి గోదారి గట్టున నడుచుకుంటూ వెళ్తుంటే కొంతమం ది ప్రేక్షకులు అతన్ని కలిసి ఏం బాబు ఇలా వెళ్తున్నావు నీ ఫేస్ బ్రైట్‌గా వెలిగిపోతుంది అని అడగగా, మన సినిమా గురించి మీకు తెలుసు కదా అని నవీన్ పోలిశెట్టి అడుగుతాడు. వాళ్లు మాకెందుకు తెలియదు 'అనగనగా ఒక రాజు' అంటూ సినిమా టైటిల్ ని చెప్పేసారు. సినిమా కోసం మేమంతా వెయిట్ చేస్తున్నామంటూ వాళ్ళు చెప్పిన మాటలతో ఇంప్రెస్ అయిన నవీన్ పోలిశెట్టి వాళ్ళం దరికి టికెట్లనుఫ్రీగా ఇస్తున్నాను అంటూ ప్రకటించారు.దాంతో తనసినిమాని చాలా డిఫరెంట్ వేలో ప్రజెంట్ చేస్తున్నాడంటూ అలాగే ప్రమోషన్స్ భారీ లెవెల్లో చేస్తున్నాడు అంటూ సోషల్ మీడియా లో కొన్ని కథనలైతే వెలువడుతున్నాయి. ఇక ఇంతకుముందు అనిల్ రావిపూడి లాంటి దర్శకుడు సైతం 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాకు భారీగా ప్రమోషన్స్ చేపట్టి సినిమాను జనాల్లోకి తీసుకెళ్లి సూపర్ సక్సెస్ ని సాధించాడు.ఇప్పుడు ఈ సినిమాని సైతం ప్రేక్షకుల్లోకి తీసుకెళ్లడానికి విపరీతమైన ప్రయత్నాలు చేస్తున్నాడు. ఇక ఈ క్రమంలోనే నవీన్ పోలిశెట్టి లాంటి యంగ్ హీరో సైతం అనిల్ రావిపూడి కి గట్టిపోటీ ఇస్తు ప్రమోషన్స్ చేపట్టడం అనేది నిజంగా చాలా గొప్ప విషయం అంటూ చాలా మంది సినిమా మేధావులు సైతం వాళ్ళ అభిప్రాయాలను తెలియజేస్తుండటం విశేషం

# వి. శాంతారామ్ బయోపిక్‌లో హీరోయిన్‌గా తమన్నా..



భారతీయ సినిమా చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన పేరు, సుప్రసిద్ధ దర్శకుడు, నటుడు, నిర్మాత అయిన దిగ్గజ చలనచిత్రకారుడు వి. శాంతారామ్ జీవితం ఇప్పుడు వెండితెరపై ఆవిష్కృతం కానుంది. ఆయన అద్భుతమైన సినీ ప్రయాణం ఆధారంగా బాలీవుడ్‌లో ఒక భారీ బయోపిక్ నిర్మాణానికి రంగం సిద్ధమైంది. ఈ బయోగ్రాఫికల్ డ్రామాకు ఆయన పేరునే 'వి. శాంతారామ్'గా ఖరారు చేశారు మేకర్స్. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌లో టైటిల్ పాత్ర (వి. శాంతారామ్ పాత్ర)లో ప్రముఖ బాలీవుడ్ యువ నటుడు సిద్దాంత్ చతుర్వేది నటించబోతుండగా.. అభిజీత్ శిరీష్ దేశ్‌పాండే దర్శకత్వం వహించనున్నారు. ఇప్పటికే మూవీ నుంచి సిద్దాంత్‌చతుర్వేది ఫస్ట్ లుక్‌ని విడుదల చిత్రబృందం తాజాగా క థానాయికను పరిచయం చేసింది. ఈసినిమాలోహీరోయిన్‌గా తమ న్నానటించ బోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భం గా తమన్నా భాటియా ఫస్ట్‌లుక్‌ని చిత్రబృందం విడుదల చేసింది.
ఈ బయోపిక్‌ను రాహుల్ కిరణ్ శాంతారామ్, సుభాష్ కాలే మరియు సరిత అశ్విన్ వర్దే సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రం వి. శాంతారామ్ యొక్క అద్భుతమైన సినీ ప్రయాణాన్ని చూపించనుంది. సైలెంట్ యుగం (మూకీ సినిమాల కాలం) నుంచి టాకీలు (శబ్దంతో కూడిన సినిమాలు) ఆపై కలర్ సినిమా యుగం వరకు ఆయన చేసిన కృషి, దర్శకుడిగా, నిర్మాతగా ఆయన ఘనమైన ప్రస్థానాన్ని ఈ చిత్రం తెరకెక్కించనుంది.
శాంతారామ్ సినీ ప్రస్థానం: 1901నవంబర్ 18, 1901లో మహారాష్ట్రలోనికోల్హాపూర్‌లో జన్మించిన వి.శాంతారామ్ 1921లో నటుడిగా వెండితెరపై అడుగుపెట్టాడు. అనంతరం నటనతో పాటు మొత్తం 55కి పైగా సినిమాలకు దర్శకత్వం వహించాడు. ప్రభాత్ ఫిల్మ్ కంపెనీ (1929), రాజ్‌కమల్ కళామందిర్ (1942) లాంటి సంస్థలు స్థాపించి 92 సినిమాలకు పైగా నిర్మాతగా వ్యవహరించాడు. శాంతారామ్ సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం అతడిని దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు (1985), పద్మవిభూషణ్ (1992 మరణానంతరం) లతో సత్కరించింది.

# అందాన్ని తప్పించుకుని తిరుగుతున్న అదృష్టం!



ఇప్పుడంటే రాన్రాను తెరపై కథానాయికలకు చోటు లేకుండా పోతోందిగానీ, ఒకప్పుడు ముగ్గురేసి హీరోయిన్స్ సందడి చేసిన సినిమాలు ఉన్నాయి. ఆ ముగ్గురి వైపు నుంచి చూపించలేని గ్లామర్ ను కొసరు వేయడానికి ఓ ఐటమ్ గాళ్ కావలసి వచ్చేది. ఎందుకంటే సినిమాకి కథాకథనాలు ఎంత అవసరమో, గ్లామర్ కూడా అంతే అవసరమని భావించేవారు. వాళ్ల అభిప్రాయం సరైనదేనని మాస్ ఆడియన్స్ నిరూపించేవారు.అయితే ఆ మధ్య కాలంలో ఓ అందాల హీరోయిన్ తెరపై తెల్ల కలువలా విరిసింది. విశాలమైన కళ్లతో .. విరుగుడు లేని చూపులతో కుర్రకారు ప్రేక్షకులకు కునుకు లేకుండా చేసింది. చక్కని కనుముక్కుతీరుతో వెండితెరకు వెలుగు తీసుకొచ్చిన బ్యూటీగా ఆమెను గురించి చెప్పుకున్నారు. ఆ సుందరి పేరే అనూ ఇమ్మాన్యుయేల్. అనూ లోని ప్రత్యేకమైన ఆకర్షణ ఆమెకి వరుస అవకాశాలు దక్కేలా చేశాయి. దాంతో ఈ బ్యూటీ ఒక రేంజ్ లో దూసుకెళ్లడం ఖాయమని అంతా అనుకున్నారు.
నాని 'మజ్ను'తో ఎంట్రీ ఇచ్చిన ఈ సుందరి, 'అజ్ఞాతవాసి' .. 'నా పేరు సూర్య' సినిమాలతో టాప్ హీరోయిన్ కేటగిరీలోకి వెళ్లిపోతుందని అభిమానులు అనుకున్నారు. కానీ ఆ సినిమాలు మాత్రమే కాదు, ఆ తరువాత చేసినవి కూడా సరిగ్గా ఆడలేదు. ఇప్పుడు కొత్త ప్రాజెక్టులకు సంబంధించి ఈ కోల కళ్ల భామ పేరు ఎక్కడా వినిపించడం లేదు. అదృష్టం ఎదురుపడితే అమ్మడు తప్పుకుపోయిందా? లేదంటే అదృష్టమే తప్పించుకుని పోయిందా? అనేదే అభిమానులకు అర్థం కానీ ప్రశ్నగా మిగిలిపోయింది.

# పూరి సేతుపతి ప్రాజెక్ట్‌లో రాధికా ఆప్టే





టాలీవుడ్ అగ్ర దర్శకుడు పూరి జగన్నాథ్ ప్రస్తుతం తమిళ నటుడు విజయ్ సేతుపతితో ఒక సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. పూరి సేతుపతి అంటూ ఈ ప్రాజెక్ట్ రాబోతుండగా.. 'పూరి కనెక్ట్స్' బ్యానర్ ఈ సినిమాను నిర్మిస్తుంది. ఈ ప్రాజెక్ట్‌లో బాలీవుడ్ నటి టబు ముఖ్య పాత్రలో నటించ బోతున్నట్లు ఇప్పటికే చిత్రబృందం వెల్లడించిం ది. అయితే తాజాగా ఈ ప్రాజెక్ట్‌కి సంబంధిం చి మరో కథానాయిక పేరు వినిపిస్తుంది.ఈ మూవీలో బాలీవుడ్ కథానాయిక రాధికా ఆప్టే నటించబోతున్నట్లు వార్తలు వస్తున్నా యి. అయితే రాధికా విజయ్‌కి జోడిగా నటిస్తుందా లేదా విలన్ పాత్రలో నటిస్తుందా తెలియాల్సి ఉంది. దర్శకుడు పూరి జగన్నాథ్, నటి చార్మి కౌర్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మిస్తుండగా.. ఈ చిత్రంలో విజయ్ సేతుపతిని ఇంతకు ముందెన్నడూ చూడని పాత్రలో చూపించనున్నట్లు పూరి జగన్నాథ్ ప్రకటించారు. ఈ సినిమా షూటింగ్ ఈ ఏడాది జూన్‌లో ప్రారంభమవుతుందని సమాచారం. 12లో ధోని చిత్రంతో తమిళంలోకి అడుగుపెట్టిన రాధికా ఆప్టే ఆ తర్వాత కబాలి, బాలకృష్ణ లెజెండ్ సినిమాలతో మంచి గుర్తింపు తెచ్చుకుంది.

# ఇక ఆషికా రంగనాథ్ ను ఆపడం కష్టమే!




వెండితెరపై వెలుగు రేఖలా తళుక్కున మెరిసే కథానాయికలు కొందరైతే, వెన్నెల ధారలా తెరపై నుంచి జారిపోయి ప్రేక్షకుల గుండె గదుల్లోకి చేరిపోయే కథానాయికలు మరికొందరు. అందం .. ఆకర్షణతో పాటు నాజూకుతనంతో ఆకట్టుకునే అలాంటి కథానాయికల జాబితాలో ఆషికా రంగనాథ్ ఒకరుగా కనిపిస్తారు. ఆషికా అంటే ఆకాశం నుంచి జారిపోయిన అందాల చందమామ అనే విషయం ఆడియన్స్ కి తొలి సినిమాతోనే అర్థమైపోయింది. 'అమిగోస్' సినిమాతో తెలుగు తెరకి పరిచయమైన ఈ తమలపాకు లాంటి అమ్మాయి, ఆ తరువాత 'నా సామిరంగ' సినిమాతో భారీ విజయాన్ని అందుకుంది. ఈ సినిమాకి ఆమె గ్లామర్ ప్రత్యేకమైన ఆకర్షణగా నిలిచింది. దాంతో ఆ సినిమాకి వెళ్లిన వాళ్లంతా థియేటర్లలో తమ మనసులు పారేసుకునే బయటికి వచ్చారు. ఇక ఈ సుందరి ఇక్కడ వరుసబెట్టి సినిమాలు చేయడం ఖాయమని అనుకున్నారు .. కానీ అలా జరగలేదు. ఆషికా ఆచితూచి కథలను ఎంచుకోవడమే ఇందుకు కారణమని అనుకోవాలి. ప్రస్తుతం ఆమె తెలుగులో 'విశ్వంభర' .. తమిళంలో 'సర్దార్ 2' .. కన్నడలో 'గత వైభవ' సినిమాలతో బిజీగా ఉంది. ఈ కన్నడ సినిమా వచ్చేనెల 14వ తేదీన థియేటర్లకు రానుంది. ఇక 'సర్దార్ 2'.. 'విశ్వంభర' కూడా భారీ అంచనాలు ఉన్న ప్రాజెక్టులే. ఈ సినిమాలు హిట్ కొడితే ఇక ఆషికను ఆపడం కష్టమేననే టాక్ బలంగా వినిపిస్తోంది. సీనియర్ స్టార్ హీరోల సరసన ఆమె బిజీగా కావడం ఖాయమేనని అంటున్నారు. చూడాలి మరి ఏం జరుగుతుందో.

# ఫ్యాన్స్‌కి గుడ్ న్యూస్ చెప్పిన పూజా హెగ్డే..



ఒకప్పుడు టాలీవుడ్ టాప్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగిన పూజా హెగ్డే ఆ తర్వాత తెలుగులో అంతగా అవకాశాలని అందిపుచ్చుకోలేకపోయింది. దాదాపు స్టార్ హీరోలందరితో కలిసి నటించిన పూజా హెగ్డేకి ఇటీవలి కాలంలో టాలీవుడ్ ఆఫర్సే లేవు. పూజా తెలుగులో సినిమా చేయక మూడేళ్లు అవుతుంది. పూజా హెగ్డేకి డీజే దువ్వాడ జగన్నాథం సినిమా మంచి గుర్తింపు తీసుకు రాగా, ఆ తర్వాత అల వైకుంఠపురములో అద్భుతంగా నటించి బుట్టబొమ్మగా అందరి మనసులలో నిలిచింది. పూజా నటించిన అరవిందసమేత వీరరాఘవ, మహర్షి లాంటి చిత్రాలు హిట్స్ కావడంతో పూజా టాలీవుడ్ టాప్ హీరోయిన్స్‌లో ఒకరిగా మారింది. అయితే మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్ తర్వాత పూజా హెగ్డేకి ఒక్క హిట్ రాలేదు. రాధే శ్యామ్, ఆచార్య నిరాశ పరచగా డబ్బింగ్ మూవీ బీస్ట్ తో పాటు హిందీ సినిమాలు సర్కస్, కిసీకా భాయ్ కిసీకా జాన్, దేవా సినిమాలు కూడా బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టాయి.

Printer, Published and Owned by AMBATI PUBLICATIONS at H.No. 8-3-214, Mallikarjun Nagar, Godavarikhani, Dist. Peddapalli. Telangana State - 505 209."
Printers : Ganesh Offset Printers, Godavarikhani. Editor: P. Ramakrishna, RNI No. TELTEL/2021/02031, email : yadavpolaveni123456@gmail.com, Mobile : 7396644411